క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. ఆర్డీఎస్ పనులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ విద్యుత్ ఫీడర్లకు సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గంగమ్మకు పొంగళ్లు

ఉదయగిరి: గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో ఆదివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే చెంచురామయ్యకు నివాళి



ఉదయగిరి: పట్టణ సమీపంలోని చెంచురామయ్య నగర్‌లో మాజీ ఎమ్మెల్యే పొన్నెబోయిన చెంచురామయ్య వర్ధంతిని మాజీ జెడ్పీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు పాల్గొని చెంచురామయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 1975లో గండిపాళెం జలాశయం నిర్మాణానికి చెంచురామయ్య శంకుస్థాపన చేశారన్నారు. ఆ కాలంలోనే ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను సాధించిన ఆయన రైతన్నల గుండెల్లో నేటికి నిలిచి ఉన్నారన్నారు.

ఆశీర్వాదం

కావలి: పట్టణంలోని స్పందన థియేటర్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన 10వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీకి చెందిన గాలంకి మాల్యాద్రి, శాంతకుమారి దంపతుల కుమారుడు మనుతేజ్ వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే 6వ వార్డు పరిధిలోని వెంగాయగారిపాళెంలో జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తాతా ప్రసాద్ కుమారుడు, కావలి మండలం రాజువారిచింతలపాళెంలో జరిగిన గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవరపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి కుమార్తె వివాహ వేడుకలకు రామిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పురుషామృగ వాహనంపై సంగమేశ్వరుడు




సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంగమేశ్వరస్వామి, కామాక్షితాయి అమ్మవార్లు శనివారం రాత్రి పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆది దంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పురుషామృగ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

అనుమసముద్రంపేట: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువును పొడిగించినట్లు ప్రిన్సిపల్ బీ శ్రీలక్ష్మమ్మ ఆదివారం తెలిపారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో 40 సీట్లు, ద్వితీయ సంవత్సరం బైపీసీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఈ నెల 21వ తేదీలోగా ఏపీకేజీబీవీ, ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ లేదా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మూలకు చేరిన కుట్టుమెషీన్లు



దుత్తలూరు: మహిళలకు కుట్టు శిక్షణ ద్వారా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మండల పరిషత్ కార్యాలయానికి అందజేసిన కుట్టు మెషీన్లను నిరుపయోగంగా మూలనపడేయడంతో తుప్పు పట్టిపోతున్నాయి. గతంలో మహిళలకు కుట్టుశిక్షణను అందించే నిమిత్తం దాదాపు పదిహేను వరకు కుట్టుమెషీన్లను అందజేశారు. అందులో ప్రస్తుతం నాలుగైదు మాత్రమే స్త్రీశక్తి భవనంలో దర్శనమిస్తున్నాయి. అవి కూడా తుప్పుపట్టి పనికిరాకుండా ఉన్నాయి. గతంలో అందజేసిన కుట్టుమెషీన్లను కొందరు ప్రైవేటు వ్యక్తులకు విక్రయించుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుట్టుమెషీన్లను వినియోగంలోకి తీసుకొచ్చి మహిళలకు కుట్టుశిక్షణ ద్వారా ఉపాధి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కియోస్క్ సేవలకు మంగళం

- రైతుసేవా కేంద్రాల్లో నిరుపయోగంగా కియోస్క్‌లు
- వాటి స్థానంలో అందుబాటులోకి పీఎంఏఐడీ యాప్
- కొత్త యాప్‌తో అరకొరగా సేవలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు



రైతుసేవా కేంద్రంలో నిరుపయోగంగా కియోస్క్

సీతారామపురం : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను రద్దు చేయగా, మరికొన్నింటి పేర్లు మార్చి అరకొరగా అమలు చేస్తోంది. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా తీసుకొచ్చిన సచివాలయ, రైతుభరోసా కేంద్రాలను సైతం కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం రైతులు ఊరుదాటకుండా అన్ని రకాల సేవలను అందించేందుకు రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో కియోస్క్‌లను ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, పశువుల దాణా, పంటలకు మార్కెటింగ్ వంటి అన్ని రకాల సేవలను పొందే అవకాశం కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుసేవా కేంద్రాల్లోని కియోస్క్‌లు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో సచివాలయ సేవలు సైతం ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో 61 కియోస్క్‌లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వాటిని ఎరువుల అమ్మకాలకు మాత్రమే ఉపయోగిస్తుండగా మిగిలిన సేవలకు రైతులు దూరంగా ఉంటున్నారు. అధికారులు మాత్రం వాటిని అన్ని రకాలుగా వినియోగిస్తున్నామని చెబుతున్నారు. ప్రస్తుతం కియోస్క్‌ల స్థానంలో పీఎంఏఐడీ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పూర్తిస్థాయిలో అన్ని విధాలుగా ఆమోదయోగ్యమైన సేవలు అందడం లేదని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలను నిరుపయోగంగా ఉంచడం సరికాదని, వాటి ద్వారా సేవలను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

“సేవలు కొనసాగించాలి”



రైతుల సంక్షేమానికి గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల సేవలు కొనసాగించాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలుతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకునేందుకు అవి ఎంతగానో ఉపయోగపడేవి. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనసాగించాలి.
–కల్లూరి వెంకటసుబ్బారెడ్డి, రైతు, రంగనాయుడుపల్లి.

“అశ్రద్ధ తగదు”



రైతులకు ఎంతగానో ఉపయోగకరమైన కియోస్క్‌లపై అశ్రద్ధ తగదు. చదువు లేని రైతులను దృష్టిలో ఉంచుకుని రైతు భరోసా కేంద్రాలను మరింత ఆధునీకరించి కియోస్క్‌లను వినియోగంలోకి తెచ్చి రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.
–అబ్బిరెడ్డి, రైతు, పోలంగారిపల్లి

“సేవలు కొనసాగుతున్నాయి”



రైతుసేవా కేంద్రాల్లో కియోస్క్ సేవలు కొనసాగుతున్నాయి. వాటిని పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నాం. రైతులకు అన్ని రకాల సేవలు అందజేస్తున్నాం. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తున్నాం.
–చెన్నారెడ్డి, ఏడీఏ, ఉదయగిరి

మద్యం మత్తులో ఘర్షణ

–కత్తితో దాడిలో దంపతులకు గాయాలు

సంగం: సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చిన గిరిజన కుటుంబ సభ్యులు మద్యం మత్తులో ఘర్షణ పడ్డారు. ఈ క్రమంతో కత్తితో సోదరి,ఆమె భర్తపై సోదరులు కత్తితో దాడికి పాల్పడడంతో వారు గాయాలపాలయ్యారు. ఈ ఘటన సంగంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు..కావలికి చెందిన పెద్దమహాలక్ష్మమ్మకు తన కుటుంబంతో సంగంలో జరుగుతున్న సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రెండ్రోజుల క్రితం వచ్చింది. ఆదివారం ఆమెతో పాటు కుమారులు ఏడుకొండలు,ఆకాష్, వెంకటేశ్వర్లు, కుమార్తె పోలమ్మ, అల్లుడు కార్తీక్ మద్యం సేవించారు. అనంతరం తమాషాగా మాట్లాడుకుంటున్న క్రమంలో వారి మధ్యన వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో పోలమ్మ, కార్తీక్‌పై పెద్దమహాలక్ష్మమ్మ, ఆమె కుమారులు కత్తితో దాడికి పాల్పడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన పోలమ్మ, కార్తీక్ దంపతులను సంగం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

భగవద్గీతపై ప్రచారం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం బుక్కాపురం, చంద్రపడియ గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. సమితి సభ్యులు జీ పెంచలరత్నం, బీ మాలకొండారెడ్డి, కే నరసింహులు, వై మహేంద్ర, డీ రమణారెడ్డి పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం : మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీల పరిధిలో జనరల్ ఫండ్ నిధులు రూ.2.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు రూ.82.50 లక్షలు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రచ్చ అరుగుల నిర్మాణానికి రూ.26.40 లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.12 కోట్లను కేటాయించామని తెలిపారు. తొలివిడతగా మార్చిలో సిద్దేశ్వరం, పోలంగారిపల్లి, బసినేనిపల్లి, నెమళ్లదిన్నె అయ్యవారిపల్లి, దేవిశెట్టిపల్లి, సంగసానిపల్లి, సింగారెడ్డిపల్లి, సీతారామపురం, గంధంవారిపల్లి గ్రామాల్లో రూ.1.85 కోట్లతో చేపట్టే పనులకు భూమి పూజ చేశామన్నారు. ప్రస్తుతం సంజీవరెడ్డినగర్‌లో రూ.10 లక్షలు, బాలాయపల్లిలో రూ.10 లక్షలు, బెడుసుపల్లిలో రూ.5 లక్షలు, నాగరాజుపల్లిలో రూ.5 లక్షలు, మారంరెడ్డిపల్లిలో రూ.5 లక్షలతో సీసీరోడ్లు, అరుగులు, మంచినీటి పథకాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలకొలను వెంకటరెడ్డి, బాలినేని మాబయ్య, లకిడి బ్రహ్మయ్య, పొట్టి రామచంద్రయ్య, రేనాటి రమణయ్య, కలివెల సతీష్‌కుమార్, దాసరి శ్రీనివాసులు, రేనాటి లక్ష్మయ్య, రాకేష్, తమ్మిశెట్టి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



సోమశిలలో ఈత మట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

సీతారామపురం : స్థానిక అరుంధతీయవాడలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు యేసు శిలువ, మట్టలతో భక్తి గీతాలను ఆలపిస్తూ చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం దివ్యబలి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. శిలువ వేయడానికి ముందు ఏసుక్రీస్తు పరిశుద్ధ జెరూషలేం నగరంలో అడుగుపెట్టిన శుభసందర్భాన్ని మట్టల ఆదివారంగా జరుపుకొంటామని తెలిపారు.



సీతారామపురంలో..

ఉదయగిరి: ఉదయగిరిలోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకొన్నారు. క్రైస్తవులు ఈతమట్టలను చేతబట్టి క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సంఘకాపరులు మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. క్రైస్తవ పెద్దలు ఈ ప్రసాదరావు, టీ జాషువా, సుధీర్‌కుమార్, జకీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో..

అనుమసముద్రంపేట: మండలంలోని చర్చిల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకొన్నారు. రాజవోలు, అనుమసముద్రం, కావలియడవల్లి, గుడిపాడు, ఏఎస్‌పేటలోని ప్రధాన చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు ఈత మట్టలను చేతబట్టి క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు.

సోమశిల: అనంతసాగరం మండలంలోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. సోమశిల, అనంతసాగరంలో క్రైస్తవులు ఈత మట్టలను చేతబటి క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. సోమశిల క్రీస్తు సంఘం దైవ సేవకులు ఐ నవీన్‌కుమార్, అనంతసాగరం దైవసేవకులు రాజ్‌కుమార్, చర్చి కమిటి సభ్యులు హరీష్, సంజయ్, సాగర్, పృథ్వీబాబు, జాషువా, విజయ్‌రత్నం పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న న్యాయవాది కేవీ శేషారెడ్డి

సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరంలోని నేషనల్ ఫంక్షన్ హాల్లో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టంపై సదస్సును ఆదివారం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది కేవీ శేషారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు వక్ఫ్ చట్టం అడ్డంగా ఉందని దాన్ని మార్చేందుకు సవర చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దేశంలో రైల్వే తరువాత అధిక ఆస్తులు ఉండేది కేవలం వక్ఫ్‌బోర్డుకు మాత్రమేనన్నారు. మసీదులు, మదర్సాలు, ఈద్గాలు, దర్గాల నిర్వహణ కోసం అనేక మంది భూములను వక్ఫ్‌కు ఇచ్చారని, వాటిని లాక్కునే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని చేసిందన్నారు. మనది లౌకిక దేశమైనందున అన్ని మతాలు సామరస్యంతో ఉండేలా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. మైనార్టీలపై జరిగే దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా, డాక్టర్ సుబ్బరాయుడు, రైతు సంఘం నాయకులు లక్కు ప్రసాద్, మస్తాన్, ఆవాజ్ నాయకులు ఇఫ్తీఖర్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని ఆర్యవైశ్యుల కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి అర్చకులు సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం సీతారాములను గజవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా చెంచురామయ్య, శ్రేష్ఠి, దోర్నాదుల సుధాకర్ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



ఆత్మకూరురూరల్: మండలంలోని వాశిలిలోని తూర్పుహరిజనవాడలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆత్మకూరుకు చెందిన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచిపరమేశ్వరరెడ్డి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో విశేష పూజలు



సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో వసంత నవ రాత్రుల సందర్భంగా చైత్రపాడ్యమి నుంచి పౌర్ణమి వరకు షోడశ మహాలక్ష్మి కలశ పూజలు నిర్వహించారు. అందులో భాగంగా పౌర్ణమి సందర్భంగా ఆదివారం పీఠాధిపతులు రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో కాశీవిశ్వేశ్వరస్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి సౌందర్యలహరి స్తోత్ర పారాయణం, శ్రీ లలితా సహస్రనామ యజ్ఞం నిర్వహించారు. అనంతరం రామక్రియా ధ్యానం, ప్రాణాయామ విశిష్టతను వివరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



దుత్తలూరు: మండలంలోని రెడ్లదిన్నెలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో మూడ్రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు వేదపండితులు శాస్త్రోక్తంగా సీతారామలక్ష్మణుల విగ్రహాలతో పాటు శిఖర కలశాన్ని ప్రతిష్టించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



వెంకటేశ్వర్లు



బీ వరలక్ష్మి



భానుశ్రీ



బీ వేణు



ఎల్ పూజ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాల్లో ప్రతిభకనబరిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 75శాతం, ప్రథమ సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత సాధించినట్లుగా ప్రిన్సిపల్ కే వాణీశ్రీ, ఆదివారం తెలిపారు. అకౌంటింగ్ మరియు ప్యాక్టీషన్‌లో సీనియర్ ఇంటర్‌లో వీ జ్యోతి 951, జూనియర్ ఇంటర్‌లో సీహెచ్ వెంకటేశ్వర్లు 486 మార్కులతో టాపర్లుగా నిలిచారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో బీ వరలక్ష్మి 896, బైపీసీలో బీ భానుశ్రీ 834 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బీ వేణు 413, సీఈసీలో ఎల్ పూజ 436 మార్కులతో టాపర్లుగా నిలిచారు. వారిని ప్రిన్సిపల్‌తో పాటు అకౌంట్స్ అధ్యాపకుడు డీ వేణుగోపాల్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు



సంగంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసు



ఆదూరుపల్లిలో తనిఖీ చేస్తున్న డీసీఓ పద్మజ

సంగం: స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తల్లిదండ్రులు తమ పిల్లలతో గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పాఠశాల, పోలీసు సిబ్బంది విద్యార్థినులకు క్షుణ్ణం తనిఖీ చేసి లోపలకు పంపారు. 5వ తరగతి ప్రవేశపరీక్షకు 184 మంది దరఖాస్తు చేసుకోగా 81 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షకు 282 మంది దరఖాస్తు చేసుకోగా 205 మంది హాజరయ్యారు. గురుకులం ప్రిన్సిపల్ సుమతి పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం ఆదూరుపల్లి గురుకులంలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లుగా ప్రిన్సిపల్ శైలజా కుమారి తెలిపారు. 5వ తరగతి ప్రవేశానికి 171 మంది దరఖాస్తు చేసుకోగా, 109 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి 199 మంది హాజరయ్యారని వివరించారు. కాగా జిల్లా అబ్జర్వర్ డీసీఓ బీ పద్మజ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

ఈదురుగాలుల బీభత్సం



సంగం: హైవేపై పడిన తాటిచెట్లను తొలగిస్తున్న పోలీసులు



మర్రిపాడు: విరిగిపడిన విద్యుత్ స్తంభం నుంచి విద్యుత్ తీగలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

మర్రిపాడు/సంగం: మర్రిపాడు, సంగం మండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలులకు సంగం సమీపంలోని కండ్రిక–ర్యాంపు మధ్యన జాతీయ రహదారిపై తాటిచెట్లు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై రాజేష్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో తాటిచెట్లను పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు. మర్రిపాడు మండలం రామానాయుడుపల్లిలో చెట్లతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు జరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు



కావలి: పట్టణంలోని పాతూరు దొడ్ల వారి వీధిలోని సీతారామస్వామి మందిరంలో శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించారు. సీతారాములను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లుంబిని పాఠశాల విద్యార్థి ప్రతిభ



ఆత్మకూరు(చేజర్ల): అభ్యాస్ అకాడమీ వారు రాష్ట్రస్థాయిలో ఆదివారం నిర్వహించిన శాట్–2025 పరీక్షలో చేజర్లలోని లుంబిని పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి యూ హేమతేజ ప్రతిభకనబరిచాడు. రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచి ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా హేమతేజను లుంబిని పాఠశాల నిర్వాహకులు అభినందించారు.